

అమెరికా వదిలి.. అరక పట్టి..

అప్పుల పాలైన సాఫ్ట్‌వేర్ సోదరులు

రుణదాతల ఒత్తిడి తాళలేక అన్న అదృశ్యం

పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లి

అప్పులవాళ్ల నుంచి కాపాడాలని వేడుకోలు



కనబడకుండా పోయిన సోమశేఖర్ (ఫైల్)

విడపనకల్లు, మార్చి 6: అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి, స్వగ్రామానికి వచ్చి వ్యవసాయం ప్రారంభించిన యువకుడు పంట నష్టాలతో అప్పుల పాలయ్యాడు. రుణదాతల ఒత్తిడి తట్టుకోలేక భార్యా, బిడ్డతో కలిసి ఇళ్లు వదిలి వెళ్లిపోయాడు. ఇప్పటికి ఏడాది గడిచింది. తిరిగి రాకపోవడంతో అతడి తల్లి విడపనకల్లు పోలీసులను ఆశ్రయించింది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... మండలంలోని ఆర్ కొట్టాల గ్రామానికి చెందిన జీ లక్ష్మీదేవికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు జీ సోమశేఖర్, చిన్న కుమారుడు జీ పవన్‌కుమార్. ఇద్దరూ విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసేవారు. వీరికి 90 ఎకరాల పొలం ఉంది. దాన్ని కౌలుకు ఇవ్వటం ఇష్టం లేక ఐదేళ్ల కిందట ఉద్యోగాలు వదిలి స్వగ్రామం వచ్చారు. అప్పటి నుంచి అన్నా తమ్ముడు సొంతంగా వ్యవసాయం చేయటం ప్రారంభించారు. తమ పొలంలో వివిధ రకాల పంటలు సాగు చేశారు. అయితే ఫలసాయం సరిగా లేకపోవడం, కరోనా పరిస్థితులు కారణంగా పెట్టుబడి పెరిగి అప్పులపాలయ్యారు. దాదాపు రూ.1.5 కోట్లు అప్పులు అయ్యాయన్నారు. ఇంటికి పెద్ద కావటంతో అప్పులు, ఇంటి బాధ్యతలు సోమశేఖరే చూసుకునేవాడు. రుణదాతల ఒత్తిడి పెరగడంతో, తట్టుకోలేక ఇళ్లు వదిలి వెళ్లిపోయాడు. సంవత్సర కాలంగా ఎదురు చూసినా తిరిగి రాక పోవటంతో సోమశేఖర్ తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమశేఖర్‌కు అప్పులు ఇచ్చిన వారు బళ్లారికి చెందిన వడ్డీ వ్యాపారులు గంగిరెడ్డి, రామాంజనేయులు, అనంతపురం నగరానికి చెందిన వడ్డీ వ్యాపారులు అమర్‌నాథ్ బృందం ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బళ్లారికి చెందిన వారికి తమకు బళ్లారిలో ఉన్న ప్లాట్ (హౌస్‌సైట్)ను రిజిస్టర్ చేయించి ఇచ్చామని, అయినా ఇంకా ఇవ్వాలని తనను, తన చిన్న కొడుకును వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురానికి చెందిన వడ్డీ వ్యాపారికి తనకు, తన చిన్న కొడుక్కు తెలియకుండానే 13 ఎకరాలు భూమిని తన పెద్ద కుమారుడు రిజిస్ట్రేషన్ చేయించాడని ఆమె తెలిపారు. వీళ్ల వల్లనే తన కొడుకు కనిపించకుండా పోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన పెద్ద కొడుకు చేసిన అప్పులను చిన్న కొడుకు ద్వారా సంవత్సరం నుంచి దాదాపు రూ.కోటి చెల్లించుకుంటూ వస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే వీళ్లు మాత్రం ఆర్ కొట్టాల గ్రామంలో తమ ఇంటి వద్దకు వచ్చి తనను, తన చిన్న కొడుకును చిత్రహింసలు పెడుతున్నారని, వీరి నుంచి పోలీసులే కాపాడాలని విన్నవించారు.

ఎమ్మెల్యే వర్సెస్ ఏడీసీసీబీ మాజీ చైర్మన్

ఆసరా చెక్కు పంపిణీ సభలో వాగ్వాదం

మహిళల సమావేశంలో వారినే అవమానిస్తారా..?

- ఏడీసీసీబీ మాజీ చైర్మన్ వీరాంజనేయులు
- గొడవ పెట్టుకునేందుకే వచ్చావా..?: గుంతకల్లు ఎమ్మెల్యే



ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డితో వాగ్వాదానికి దిగిన ఏడీసీసీబీ మాజీ చైర్మన్ వీరాంజనేయులు

పామిడి, మార్చి 6: పట్టణంలో బుధవారం నిర్వహించిన ఆసరా చెక్కు పంపిణీ సభ మాటల యుద్ధానికి వేదికైంది. గుంతకల్లు వైసీపీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి, అదే పార్టీకి చెందిన అనంతపురం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఏడీసీసీబీ) మాజీ చైర్మన్ వీరాంజనేయులు మాటల యుద్ధానికి దిగారు. పామిడి పట్టణంలోని ఫారెస్టు బంగ్లా సమీపానగల ఖాళీ స్థలంలో వైఎస్ఆర్ ఆసరా 4వ విడత చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని మండల అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభిస్తారని తెలిపారు. ఆ మేరకు మహిళలు ఉదయం 9.30 గంటలకే సమావేశ స్థలం వద్దకు చేరుకున్నారు. సభాప్రాంగణానికి ఏడీసీసీబీ మాజీ చైర్మన్ వీరాంజనేయులు.. తన కుమార్తె బ్యాంకు ప్రస్తుత చైర్‌పర్సన్ లిఖిత, అనుచరులతో కలిసి మధ్యాహ్నం 12 గంటలకు చేరుకున్నారు. గుంతకల్లు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి మధ్యాహ్నం 12.50 గంటలకు వచ్చారు. ఇప్పటికే ఆలస్యమైందనీ, వక్తలు కాకుండా తానే నాలుగు మాటలు మాట్లాడి ముగించేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. దీనిపై ఏడీసీసీబీ మాజీ చైర్మన్ వీరాంజనేయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద సభలో సీఎం గురించి, ప్రభుత్వం గురించి మహిళలను మాట్లాడనీయకుండా ఒక్కరే ప్రసంగించి, ఎలా ముగిస్తారని నిలదీశారు. 'ఇలా మాట్లాడడం బాగుండదు, నువ్వు దిగిపో..' అని ఎమ్మెల్యే అనడంతో మాటామాటా పెరిగి వాగ్వాదం తలెత్తింది. 'నా కుమార్తె, ఏడీసీసీబీ చైర్‌పర్సన్ లిఖితను మాట్లాడనీయకూడదన్నదే మీ ఉద్దేశమనీ, మహిళల సమావేశంలో మహిళలను అవమానించడం ఏంట'ని వీరాంజనేయులు ప్రశ్నించారు. 'నువ్వెందుకు వచ్చావు.. గొడవ చేసేందుకే వచ్చావా.. ఇక్కడి నుంచి వెళ్లిపోమం'టూ ఎమ్మెల్యే గట్టిగా వారిస్తూ చీదరించారు. గంటల తరబడి ఆలస్యంగా వచ్చి మహిళలను మాట్లాడనీయకుండా చేస్తారా అని వీరాంజనేయులు మండిపడ్డారు. తాను కూడా వైసీపీ నాయకుడినేననీ, ప్రొటోకాల్ తమకూ వర్తిస్తుందనీ, బెదిరిస్తున్నారా..? అంటూ గట్టిగా వారించడంతో వివాదం మరింత ముదిరింది. దీంతో పక్కనే ఉన్న సీఐ రాజశేఖర్‌రెడ్డి.. తన సిబ్బందిని పంపి వీరాంజనేయులును స్టేజీ నుంచి కిందకి దింపమని ఆదేశించారు. పోలీసులు ఇరువురికి సర్దిచెప్పారు. అనంతరం ఎమ్మెల్యే అందరినీ మాట్లాడమంటారా.., తానొక్కడినే ప్రసంగించమంటారా అని సభకు హాజరైన మహిళలను అడిగారు. అందరూ మాట్లాడం అని వారు చేతులు ఊపారు. ఇప్పటికే ఆలస్యమైందనీ, తానొక్కడినే నాలుగు మాటలు మాట్లాడతానంటూ ఆయన ప్రసంగించారు. అనంతరం చెక్కు విడుదల, సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం, కేక్ కటింగ్‌తో సభను ముగించారు. ఏడీసీసీబీ చైర్‌పర్సన్ లిఖితతోపాటు వేరెవరికీ మాట్లాడే అవకాశం ఇవ్వలేదు.

ఎమ్మెల్యే ఒక్కరే ప్రారంభోత్సవం

వంకరాజుకాలువ గ్రామంలో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఏడీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, మాజీ చైర్మన్ వీరాంజనేయులు.. అనుచరులతో వెళ్లి సందర్శించి వచ్చారు. వారు తిరిగి వచ్చిన అరగంటకు ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి వాటిని ప్రారంభించారు. దీనిపై వీరాంజనేయులు వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అండగా ఉంటాం

కార్యకర్తలకు నారా భువనేశ్వరి భరోసా



టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టును తట్టుకోలేక అనేక మంది అర్ధంతరంగా మరణించారు. దీంతో చంద్రబాబు జైల్లో ఉండగానే బాధితులను పరామర్శించి, అండగా ఉంటామని ఆయన సతీమణి భువనేశ్వరి ప్రకటించారు. నిజం గెలవాలి పేరుతో పర్యటిస్తూ చంద్రబాబు కోసం మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ ఆర్థిక సాయం చేస్తున్నారు. ఈక్రమంలో బుధవారం ఆమె అనంతపురం జిల్లాలో పర్యటించారు. అనంతపురం, కళ్యాణదుర్గం, కణేకల్లు ప్రాంతాల్లో మృతుల కుటుంబాలను పరామర్శించి, ఓదార్చారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకునానరు. అధైర్యపడవద్దని అండగా ఉంటామని భరోసానిచ్చారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రజా వేదికల వద్ద ఆమె వైసీపీ ప్రభుత్వ విధానాలను విమర్శించారు. ఆమె వెంట ఆయా ప్రాంతాల టీడీపీ నాయకులు, మహిళలు, యువత పాల్గొన్నారు. - 7లో...

నిబంధనలు తూచ్..!

వైసీపీ ప్రచారంలో వలంటీర్లు, ఆర్‌పీ, డీలర్లు

పెడచెవిన అధికారుల తాఖీదులు

ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతరు





రాయదుర్గంలో నిర్వహిస్తున్న ప్రచారంలో పాల్గొన్న స్టోర్ డీలర్లు , కరపత్రాలతో ప్రచారం చేస్తున్న వలంటీర్

రాయదుర్గం, మార్చి 6: ఎన్నికల ప్రచారంలో వైసీపీ తరపున వలంటీర్లు పాల్గొని అభ్యర్థుల గెలుపు కోసం శ్రమిస్తున్నారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి వార్డులు, గ్రామాల్లో పర్యటించి ప్రచారం చేస్తుండగా వలంటీర్లు కూడా భాగస్వాములై ఇంటింటికి వెళుతున్నారు. వీరితో పాటు కొన్ని చోట్ల మున్సిపల్ మెప్మా విభాగం ఆర్‌పీలు, చౌకధాన్యపు డిపోల డీలర్లు సైతం వైసీపీ కండువాలు వేసుకొని ప్రచారం చేస్తున్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా స్వామి భక్తిని చాటుకుంటున్నారు. వీటిపై ఫిర్యాదులు వస్తుండటంతో అధికారులు వారికి తాఖీదులిచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ప్రతిపక్ష టీడీపీ పలు సందర్భాల్లో ఆధారాలతో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇటీవల వైసీపీ నాయకుడు మెట్టు గోవిందరెడ్డి తన నివాసంలో మున్సిపల్ మెప్మా విభాగం ఆర్పీలతో దర్జాగా సమావేశం నిర్వహించారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఫిర్యాదు కూడా చేశారు. వార్డుల్లో వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొని కరపత్రాలను అందించడమే కాక అభ్యర్థి ఫొటోతో పాటు ఫ్యాన్ గుర్తున్న స్టిక్కర్లను అతికిస్తున్నారు. ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన వివరాలను పథకాల గురించి తెలిపి జగన్ గెలవాలంటే మెట్టు గోవిందరెడ్డికి ఓటు వేయాలని వారు తెలపడం తీవ్ర వివాదస్పదమవు తోంది.

వైసీపీకి ఫీల్డ్ అసిస్టెంట్ ప్రచారం

డీ.హీరేహాళ్, మార్చి 6: నిబంధనలు తుంగలో తొక్కి కొంతమంది కిందిస్థాయి ఉద్యోగులు వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇది మండల స్థాయి అధికారులు గమనించినా మిన్నకుండిపోతున్నారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి బుధవారం మండలంలోని వసగుడ్డం, మల్లికేతి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పులకుర్తి గ్రామ పంచాయతీ, వసగుడ్డం గ్రామాలకు చెందిన ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. వైసీపీ నాయకుల వెంట ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికారుల ఉదాశీనత వల్లే ఇలా జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ విజయకుమార్ (నీలిరంగు చొక్కా వేసుకున్న వ్యక్తి)





బాసిజంపై భగ్గు

ఉన్నతాధికారులు వర్సెస్ జడ్పీటీసీలు

- గత ఏడాది వరకూ ప్రశాంతంగా పాలన
- ఐఏఎస్‌లు సీఈఓలుగా వచ్చాకే సమస్య
- కొత్తగా తీర్మానాల మెలికలు పెట్టిన జేసీ
- రోడ్లపైకి వచ్చిన పాలకవర్గ సభ్యులు
- అధికారులు, పాలకవర్గ సభ్యుల మధ్య నలిగిన ఉద్యోగులు
- రెండుసార్లు మాస్ లీవ్‌కు యత్నాలు
- 9 నెలల్లో ఆఫీస్ నుంచి రోడ్డుపైకి వచ్చిన పాలనా నిర్ణయాలు
- నాడు సీఈఓగా జేసీ, నేడు సీఈఓగా మరో ఐఏఎస్
- ప్రశాంత పాలన నుంచి.. ఖాకీల నీడన పాలన వరకూ మార్పు
- ఇదేనా ఐఏఎస్ మార్క్ పాలన అంటున్న జడ్పీటీసీలు



జడ్పీ మెయిన్ గేటు వద్ద కాపలాగా కానిస్టేబుల్‌ను ఉంచిన దృశ్యం

'మీరు ఇక్కడ చూస్తున్న ఈ ఫొటో జిల్లా పరిషత్ కార్యాలయంలోనిది. ఏంటి కానిస్టేబుల్ ఉన్నారు..? ఏదైనా గొడవ జరిగిందా..!!, లేక ఎవరైనా నిందితులు, దుండగులు వస్తుంటారేమోనని కాపలాగా పోలీసులను పెట్టినట్లు ఉన్నారని పొరబడకండి. ఇది నిత్యం వందలాది మంది ప్రజలు, ఇతర ప్రజాప్రతినిధులు వారి సమస్యలు, పనులపై వచ్చే కార్యాలయం. ఇక్కడ మునుపు ఎన్నడూ లేని విధంగా ఇద్దరు కానిస్టేబుళ్లను ఉంచారు. వైసీపీ పాలనలో ఇద్దరు ఐఏఎస్ అధికారులు జడ్పీ సీఈఓలుగా పని చేయడంతోనే ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. ఇటీవలి కాలంలో జడ్పీటీసీలు వర్సెస్ అధికారులు అన్నట్లుగా జడ్పీలో పరిస్థితి తయారైంది. అందుకే ఖాకీలు కాపలా పరిస్థితి వచ్చింది'.

- అనంతపురం విద్య

కొంత కాలంగా జడ్పీ ఉన్నతాధికారులు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల జడ్పీలో కానిస్టేబుళ్లను కాపలా పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని పలువురు జడ్పీటీసీ సభ్యులు విమర్శిస్తున్నారు. గత 9 నెలల నుంచి జడ్పీ బ్యూరోక్రసీ తీసుకుంటున్న నిర్ణయాలు జడ్పీటీసీలను ఉక్కిరిబిక్కిరి చేయడంతోపాటు, పాలకవర్గ సభ్యులను అసహనం, ఆవేశానికి గురిచేస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇటీవల మూకుమ్మడిగా జడ్పీటీసీలు 7 స్టాండింగ్ కమిటీ సమావేశాల నుంచి వాకౌట్ చేసి, రోడ్డుపైకి వచ్చారు. దీంతో గత కొంతకాలంగా అధికారులు వర్సెస్ పాలకులు అంటూ అంతర్గతంగా ఉన్న విభేదాలు వీధికెక్కాయి.

జడ్పీటీసీలకు మింగుడు పడని 'తీర్మాన' నిర్ణయం

జడ్పీ ఉన్నతాధికారులు తీసుకున్న కొన్ని నిర్ణయాలు జడ్పీటీసీలకు మింగుడుపడకుండా పోయాయి. 2023 జూన్ వరకూ పంచాయతీరాజ్ శాఖ అధికారులే జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓగా ఉండేవారు. అప్పుడు పాలన బాగానే సాగింది. తర్వాత వేరే శాఖ అధికారులు జడ్పీకి ఉన్నతాధికారులుగా రావడంతో పరిస్థితులు మారాయి. గతంలో జడ్పీలో తీర్మానం చేసిన తర్వాత పనులను జడ్పీటీసీలు ప్రాతినిధ్యం వహించే మండలాలకు కేటాయించేవారు. దీంతో ఆయా జడ్పీటీసీలు వారి వారి మండలాల్లో పనులు చేయించుకునే వారు. అయితే జడ్పీ సీఈఓగా జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ వచ్చాక పనులు కావాలంటే ఆయా గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు తీర్మానం చేయాలన్న నిర్ణయాన్ని తెరపైకి తెచ్చారు. దీనికితోడు ఆయన సుమారు 24 కాలమ్స్ చెక్ లిస్టును ప్రవేశపెట్టారని జడ్పీటీసీలు చెబుతున్నారు. పంచాయతీ లేదా మండల పరిషత్ తీర్మానం తీసుకోవడం జడ్పీటీసీలకు కష్టంగా మారింది. జడ్పీ నుంచి తాము తెచ్చుకునే వర్కులపై సర్పంచులు, ఎంపీపీల పెత్తనం ఏంటి, అసలే మాకు నిధులు కొరత ఉంటుంది, ఇలాంటి పరిస్థితుల్లో ఈ తీర్మానాల గోల ఏంటంటూ పలువురు జడ్పీటీసీలు గగ్గోలు పెడుతున్నారు. గతంలో సీఈఓగా ఉన్న జేసీ తీసుకొచ్చిన ఈ నిర్ణయాన్ని జడ్పీటీసీలు తీవ్రంగా తప్పుబట్టారు. బహిరంగంగానే మీటింగ్‌లో ప్రశ్నించారు. అయితే ఆ తర్వాత పనుల విషయంలో అదే కొనసాగిస్తూ వచ్చారు. కానీ పనులు ముందుకు సాగకపోవడంతో రెండు నెలల కిందట జరిగిన సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ గౌతమి, ఇతర ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు చర్చించి పంచాయతీ, మండల పరిషత్ తీర్మానం కావాలన్న నిర్ణయాన్ని రద్దు చేశారు. దీంతో పాటు మరిన్ని తీర్మానాలు చేశారు. ఆ తీర్మానాల అమలు అటుంచితే...ఆఖరికి తీర్మానాలు నమోదు చేసే రిజిస్టర్లు కూడా మాయం అయినట్టు సమాచారం. దీంతో అప్పటి నుంచి జడ్పీటీసీలు తీవ్ర అసహనంతో ఉన్నారు. దీనికితోడు జడ్పీటీసీలు వివిధ పనులపై ఆఫీస్‌కు వస్తే కొందరు అధికారులు గంటల తరబడి వేచి చూసేలా వ్యవహరించడం, సరిగ్గా మాట్లాడకపోవడం కూడా జడ్పీటీసీల్లో అసహనానికి కారణంగా నిలుస్తోంది.



సర్వసభ్య సమావేశంలో నేలపై కూర్చుని నిరసన తెలుపుతున్న జడ్పీటీసీలు (ఫైల్)

ఐఏఎస్‌ల మార్క్ ఏదీ..?

గత ఏడాది జూన్ వరకూ జడ్పీలో పాలన ప్రశాంతంగానే సాగింది. ఇలా రోడ్లెక్కే పరిస్థితి లేదు. జూన్‌లో ఇద్దరు అధికారులు వివిధ కారణాలతో ఒకరి తర్వాత ఒకరు సస్పెండ్ అయ్యారు. తర్వాత సీఈఓగా జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌ను నియమించారు. ఈ క్రమంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు జడ్పీటీసీల అసహనానికి కారణమయ్యాయి. ఏదైనా పనిమీద ఆయన్ను కలవాలంటే కలెక్టరేట్‌కు వెళ్లాల్సి రావడం ఇబ్బందిగా జడ్పీటీసీలు భావించారు. జడ్పీ డిప్యూటీ సీఈఓను కలిసి విన్నవిద్దాం అను కున్నా ఆమె జడ్పీటీసీలను సమన్వయం చేసుకోకపోవడంతో.. అధికారులు, జడ్పీటీసీల మధ్య అంతరం మరింత పెరిగింది. దీంతో పాలకవర్గం, అధికారుల మధ్య బాగా గ్యాప్ వచ్చింది. వీరి మధ్య ఉద్యోగులూ నలిగిపోయారు. ఈక్రమంలోనే గత ఏడాది ఉద్యోగులు సామూహిక సెలవు బాట పట్టారు. ఇటీవల మరోసారి ఐఏఎస్ అధికారి నిదియాదేవిని ప్రభుత్వం జడ్పీ సీఈఓగా నియమించింది. జడ్పీకి కొత్త మేడం వచ్చారంటూ జడ్పీటీసీలు సంతోషపడ్డారు. ఆమె బాధ్యతలు చేపట్టిన తర్వాత మార్పు వస్తుందను కుంటే జడ్పీటీసీలు మరిన్ని కొత్త సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. జడ్పీ సీఈఓకు పెద్దగా తెలుగు భాష రాదు. జడ్పీటీసీల్లో చాలా మందికి ఇంగ్లిష్ లేదా...హిందీ రాదు. దీంతో ఏదైనా సమస్యను సీఈఓ దృష్టికి తీసుకెళ్లడం జడ్పీటీసీలకు చాలెంజ్‌గా మారింది. అటు జడ్పీటీసీలకు, ఇటు సీఈఓకు వారధిగా ఉండాల్సిన డిప్యూటీ సీఈఓ కానీ, ఇతర అధికారులు కానీ ఆ పని చేయలేకపోతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో మరోసారి పాలకవర్గం, కొత్త సీఈఓ మధ్య గ్యాప్ వచ్చింది. దీంతో జనవరి నెలలో మరోసారి ఉద్యోగులు తమ సీట్ల నుంచి బయటకొచ్చారు. పాలకవర్గం, అధికారుల మధ్య నలిగిపోతున్నాం అంటూ ఆవేదన చెందారు. ఇలా గత 9 నెలల కాలంలో రెండుసార్లు ఉద్యోగులు కూడా బ్యూరోక్రసీ బాసిజంపై భగ్గుమన్నారు.

కార్యాలయానికి ఖాకీల కాపలా

ఈ వరుస పరిణామాలతో జడ్పీటీసీలు ఆగ్రహంగా ఉన్నారు. ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీలో అధికారులపై దుమ్మెత్తి పోశారు. డిప్యూటీ సీఈఓను రెండు రోజుల్లో సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో చేసిన తీర్మానాలు అమలు చేయాలని పట్టుబట్టారు. అయినా అధికారుల నుంచి చలనం లేకపోవడంతో మీటింగ్ నుంచి వాకౌట్ చేశారు. రోడ్లపైకి వచ్చి సీఈఓ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అక్కడితో ఆగకుండా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం బాటపట్టారు. గత నెల 29న స్టాండింగ్ కమిటీ సమావేశం వాయిదా పడింది. డిప్యూటీ సీఈఓను సరెండర్ చేయడంతో పాటు, తీర్మానాలు అమలు చేస్తేనే తాము మళ్లీ జనరల్ బాడీ, స్టాండింగ్ కమిటీ సమావేశాలకు వస్తాం అంటూ జడ్పీటీసీలు అల్టిమేటం విధించారు. స్టాండింగ్ కమిటీ సమావేశాలు వాయిదా పడిన మరుసటి రోజే మళ్లీ నిర్వహించాలి. అయితే ఆరు రోజులు గడిచినా...నిర్వహించలేదు. దీంతో జడ్పీటీసీలు భగ్గుమంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో జడ్పీ పాలన వివాదాలతోనే సాగుతుందా లేక సమస్యలు పరిష్కారమవుతాయా అన్న సందేహం సామాన్యుల్లో కలుగుతోంది.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

రాజకీయపార్టీల సమీక్షలో కలెక్టరు గౌతమి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు గౌతమి

అనంతపురం టౌన్, మార్చి 6: రాజకీయపార్టీలు, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు గౌతమి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నియమావళిపై రాజకీయపార్టీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే కోడ్ అమల్లోకి వస్తుందన్నారు. అపుడు రాజకీయపార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తారన్నారు. ఎన్నికల కమిషన్ ఎప్పటికపుడు ఇచ్చే సూచనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందన్నారు. రాజకీయపార్టీలు, అభ్యర్థులు ఏమిచేయకూడదో, ఏమి చేయవచ్చో పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల నిబంధనలు అతిక్రమించరాదని సూచించారు. ఎన్నికలలో నామినేషన్ల ప్రక్రియ చాలా ముఖ్యమైనదని, వీలైంతవరకు ముందుగానే దరఖాస్తులను పరిశీలించుకొని నామినేషన్లు వేసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలపై అవగాహన ఉన్నవారినే ఏజెంట్లుగా నియమించుకోవాలన్నారు. ఈవీఎంల పైనా అవగాహన ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల కోసం కమాండ్ కంట్రోల్‌రూమ్‌తోపాటు సోషల్‌మీడియాసెల్, మీడియా మానటరింగ్‌సెల్ కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు ఖర్చు ల విషయంలోనూ నిబంధనలు పాటించాలన్నారు, పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థి రూ.95లక్షలు, అసెంబ్లీకి పోటీచేసే అభ్యర్థి రూ.40లక్షల వరకు మాత్రమే ఖర్చు పెట్టాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డీపీఓ ప్రభాకరరెడ్డి, బీసీ వెల్ఫేర్‌డీడీ ఖుష్బూ కొఠారీతోపాటు పలుపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

• టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆలం



చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆలం

అనంతపురం మార్చి 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆలం నరసానాయుడు నియమిస్తూ ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు బుధవారం ఉత్తర్వులు జారీ చే శారు. 30 ఏళ్లుగా తెలుగు దేశం పార్టీ అభ్యున్నతి కోసం పనిచేస్తున్న నరసానాయుడు ఇదివరకు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. ఎన్నికల నేపథ్యంలో ఆయనను రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించారు. దీంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆలం నరసానాయుడుకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. ఆలం నరసానాయుడు నార్పల మండల పార్టీ అధ్యక్షుడిగా, పార్టీ జిల్లా కార్యదర్శిగా, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా, అధికార ప్రతినిధిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అనంతపురం మార్కెట్ యార్డు చైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎనిమిదేళ్ల సేవలు అందించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారాన్ని కోల్పోయిన తర్వాత శింగనమల నియోజకవర్గం టూమెన్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతూ వస్తున్నారు. కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో రాష్ట్ర స్థాయి పార్టీ పరిశీలకులుగా పనిచేశారు. ఆ క్రమంలోనే ఆలం సేవలను గుర్తించిన ఆ పార్టీ అధిష్టానం తాజాగా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించింది. తనను రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెనాయుడు, జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు, ఉమ్మడి అనంత జిల్లా కో - ఆర్డినేటర్ కోవెలమూడి నానిలకు ఈ సందర్భంగా ఆలం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు.

బీసీ డిక్లరేషన్‌పై టీడీపీ బీసీ సెల్ నాయకుల ఆనందం

అనంతపురం అర్బన్, మార్చి 6: జయహో బీసీ రాష్ట్ర స్థాయి సభలో టీడీపీ, జనసేన బీసీ డిక్లరేషన్ విడుదల చేయడంపై టీడీపీ బీసీ సెల్ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద చంద్రబాబు, నారా లోకేశ్, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం టపాసులు పేల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, దేవళ్ల మురళి, మారుతీకుమార్ గౌడ్, సుధాకర్ యాదవ్, సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, పోతుల లక్ష్మీనరసింహులు, గోపాల్ గౌడ్, కుమార్‌నాయుడు, గంగవరం అంజి, ఉప్పర శ్రీనివాసులు, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు, నారాలోకేశ్, పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

శంఖారావం.. సర్వసన్నద్ధం

జిల్లాలో నేటి నుంచి నారా లోకేశ్ సభలు
హిందూపురానికి చేరుకున్న యువనేత
తొలిరోజు హిందూపురం, మడకశిర,
పెనుకొండ నియోజకవర్గాల్లో పర్యటన
శుక్రవారం పుట్టపర్తి, కదిరిలో..
ఏర్పాట్లలో నేతలు, శ్రేణులు నిమగ్నం


హిందూపురం వద్ద సిద్ధమవుతున్న సభాస్థలి


పుట్టపర్తి ఎయిర్‌పోర్టులో నారా లోకేశ్‌తో టీడీపీ నేతలు

పుట్టపర్తి, మార్చి6(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ చేపట్టనున్న శంఖారావం యాత్రకు సర్వం సన్నద్ధమైంది. హిందూపురం నియోజకవర్గంలో గురువారం యాత్ర ప్రారంభం కానుంది. శంఖారావం సభల్లో పాల్గొనేందుకు బుధవారం సాయంత్రం నారా లోకేశ్ ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుని, హిందూపురానికి వెళ్లారు. ఆయనకు పుట్టపర్తి విమానాశ్రయంలో ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ, జనసేన నేతలు స్వాగతం పలికారు. గురువారం ఉదయం 10 గంటలకు హిందూపురం మండలం జీటీఎం లేఅవుట్ లోటస్ పబ్లిక్ పాఠశాల వద్ద శంఖారావం సభ ప్రారంభమై యువనేత నారా లోకేశ్ ప్రసంగిస్తారు. 11 గంలకు పార్టీ శ్రేణులతో ముఖాముఖిగా మాట్లాడతారు. అనంతరం మడకశిర, పెనుకొండ సభల్లో పాల్గొని రాత్రి 7.15 గంటలకు పుట్టపర్తికి చేరుకుని, అక్కడ బస చేస్తారు. శుక్రవారం పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో శంఖారావం సభల్లో పాల్గొననున్నారు. ఇప్పటికే జిల్లాలో యువగళం ద్వారా లోకేశ్ ప్రజల్లోకి దూసుకుపోయారు. కదిరి, పుట్టపర్తి, పెనుకొండ, రాప్తాడు, ధర్మవరం నియోజక వర్గాల మీదుగా యువగళం పాదయాత్ర చేపట్టారు. జగన్ అరాచక పాలనపై విరుచుకపడ్డారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. తాజాగా రెండు రోజులపాటు జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో శంఖారావం సభల్లో పాల్గొంటున్నారు. గురువారం హిందూపురం నుంచి ప్రారంభించి శుక్రవారం కదిరిలో ముగింపు చేయనున్నారు. సభలను విజయవంతం చేసేందుకు పెద్దసంఖ్యలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు.

పురంలో అల్లుడికి ఘనస్వాగతం

హిందూపురం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చేపట్టిన యాత్రలో భాగంగా బుధవారం రాత్రి తన మామ నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురానికి చేరుకున్నారు. అత్తగారింటికి వచ్చిన అల్లుడి తరహాలో టీడీపీ, జనసేన నాయకులు.. నారా లోకేశ్‌కు స్వాగతం పలికారు. చిలమత్తూరు, లేపాక్షి మండలాల్లో యువనేతకు పూలహారాలు వేసి, హిందూపురం మండలం పూలకుంటలో రూరల్ మండల నాయకులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. అక్కడి నుంచి పట్టణంలోకి ప్రవేశించగా శ్రీకంఠపురం సర్కిల్‌లో భారీఎత్తున జనం తరలిరాగా వారికి అభివాదం చేసి ముందుకు కదిలారు. సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేశారు. గాంధీ సర్కిల్‌లో విగ్రహానికి పూలమాలలు వేయగా.. టీడీపీ పార్లమెంటు కోఆర్డినేటర్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో భారీ గజమాలతో సత్కరించారు. అక్కడి నుంచి బయల్దేరి కొల్లకుంట ఇందిరమ్మ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన శంఖారావం సభాప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడే బస చేయనున్నారు.

అనంత జిల్లాలో శంఖారావం

అనంతపురం అర్బన్, మార్చి 6: నారాలోకేశ్ అనంత జిల్లాలో శంఖారావం కార్యక్రమ షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 10న ఉరవకొండ, అనంతపురం అర్బన్, రాయదుర్గం నియోజకవర్గాల్లో శంఖా రావం ఉంటుంది. ఈనెల 11న కళ్యాణదుర్గం, శింగనమల, తాడిపత్రి, గుంతకల్లు నియోజకవర్గాల్లో శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దీంతో ఆయా నియోజకవర్గాల టీడీపీ ముఖ్యనాయకులు శంఖారావం నిర్వహణ ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

నారా భువనేశ్వరి భరోసా
అనంతలో డేరంగుల వెంకటమ్మ కుటుంబసభ్యులకు పరామర్శ


అనంతపురంలో నారా భువనేశ్వరి అభివాదం

అనంతపురం అర్బన్, మార్చి 6: చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని నారా భువనేశ్వరి భరోసానిచ్చారు. నిజం గెలవాలి నినాదంతో బుధవారం ఆమె జిల్లా పర్యటనకు వచ్చారు. స్థానిక అశోక్‌నగర్‌లో చంద్రబాబు అరెస్టును టీవీలో చూస్తూ గుండెపోటుతో మృతి చెందిన డేరంగుల వెంకటమ్మ ఇంటికి వెళ్లారు. వెంకటమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఇదివరకే పార్టీ తరఫున తమకు రూ.3 లక్షల చెక్కు అందించినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆమెకు తెలిపారు. అంతకు ముందు మరూరు టోల్ ప్లాజా వద్ద టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, తెలుగు మహిళలు, టీడీపీ నాయకులు నారా భువనేశ్వరికి ఘన స్వాగతం పలికారు.

● జిల్లాలో నిజంగెలవాలి కార్యక్రమానికి వచ్చిన నారా భువనేశ్వరిని బుధవారం మధ్యాహ్నం భోజన విరామం సమయంలో కురుగుంట వద్ద మాజీ మంత్రి పరిటాల సునీత, శింగనమల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.


నారా భువనేశ్వరికి హారతి పడుతున్న తెలుగు మహిళలు


డేరంగుల వెంకటమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ..

ప్రజాస్వామ్యంలో 'నిజం గెలవాలి'

గంజాయి, ఇసుక అక్రమ రవాణాకు కేరాఫ్ అడ్రస్‌గా ఆంధ్రా
రాష్ట్ర సచివాలయాన్ని తాకట్టు పెట్టడం సిగ్గుచేటు
పక్కరాష్ట్రాలకు వెళుతున్న పరిశ్రమలు
రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ
ప్రభుత్వంపై నారా భువనేశ్వరి విమర్శలు
మృతుల కుటుంబాలకు పరామర్శ


దొడ్డి నారాయణప్ప కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నారా భువనేశ్వరి

కళ్యాణదుర్గం, మార్చి 6: 'ప్రజాస్వామ్యంలో నిజం గెలవాలి. నిజమైన స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసేందుకు ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉండాలి' అని నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుతో మరణించిన వారి కుటుంబాలను బుధవారం ఆమె పరామర్శించారు. కళ్యాణదుర్గం మండలంలోని ఎం కొండాపురం గ్రామంలో బాధిత కుటుంబం నారాయణప్ప, ముదినాయనపల్లిలో తలారి శ్రీరాములు, మోరేపల్లి కొత్తూరులో పోతురాజు పాతన్న కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ. 3 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం 53 రోజుల పాటు చంద్రబాబునాయుడును అక్రమంగా జైల్లో పెట్టిందని విమర్శించారు. చంద్రబాబునాయుడు అరెస్టును తట్టుకోలేక రాష్ట్ర వ్యాప్తంగా 206 మంది చనిపోయారన్నారు. వారందరికీ మనోధైర్యం ఇస్తూ, బాధిత కుటుంబాలకు భరోసానిస్తూ, నిజం గెలవాలి పేరుతో మీ ముందుకు వచ్చానన్నారు. చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు చేశారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో తొలుత రూ. 3 వేల కోట్లు స్కామ్ చేశారని, ఆ తరువాత రూ. 327 కోట్లు మాత్రమేనని, చివరికి రూ.27 కోట్లు మాత్రమే స్కాం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొందన్నారు. అది కూడా కోర్టులో రుజువు చేయలేకపోయిందన్నారు. అప్పుడు అందరికీ మరోమారు చంద్రబాబునాయుడి నిజాయతీ, గొప్పదనం తెలిసిందన్నారు. 14 సంవత్సరాల పాటు సీఎంగా చంద్రబాబు పని చేశారని, ప్రజల సొమ్ము కోసం ఏనాడూ ఆశపడలేదన్నారు. రాష్ట్ర ప్రజల బాగు కోసమే రాత్రింబవళ్లు ఆలోచించారన్నారు. చంద్రబాబునాయుడు ఆంధ్రాను అభివృద్ధిలో అగ్ర స్థానంలో నిలపడానికి ప్రయత్నిస్తే ప్రస్తుత పాలకులు గంజాయి, ఇసుక అక్రమ రవాణా, అక్రమ మద్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చారని విమర్శిం చారు. రాష్ట్ర సచివాలయాన్ని సైతం తాకట్టు పెట్టడం సిగ్గుచేటన్నారు. అప్పు తెచ్చిన సొమ్ము ఎక్కడికి పోతుందో ఎవరి ఖాతాలకు వెళుతుందో చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. చంద్రబాబు నాయుడిపై నమ్మకంతో అమరావతికి 33 వేల ఎకరాల భూమిని రైతులు ఇచ్చారన్నారు. కానీ ఈరోజు రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ తయారైందన్నారు. పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయన్నారు. టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ, అమిలినేని సురేంద్రబాబు తనయుడు అమిలినేని యశ్వంత్, మల్లికార్జున, గోళ్ల వెంకటేశులు, డీకే రామాంజనేయులు, సర్మస్ వలీ, పాపంపల్లి రామాంజనేయులు, వైపీ రమేష్, త్రివేణి లాల్ కృష్ణ, అనిల్ చౌదరి, సుధాకర్ నాయుడు, మహిళలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


మోరేపల్లి కొత్తూరులో పోతురాజు పాతన్న కుటుంబానికి చెక్కు అందజేస్తూ..

బాబు గెలుపుతోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

కణేకల్లు: రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన చంద్రబాబునాయుడి గెలుపుతోనే సాధ్యమని ఆయన సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె మండలంలోని గోపులాపురం గ్రామంలో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. గ్రామానికి చెందిన తలారి వన్నూరప్ప చంద్రబాబు జైలుకు వెళ్లాడన్న వార్తను జీర్ణించుకోలేక చనిపోయాడు. ఆయన భార్య మంగమ్మతో పాటు కుటుంబ సభ్యులను నారా భువనేశ్వరి పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చే ఎన్నికలు మన అందరికీ ఎంతో కీలకమైనవని ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేసి టీడీపీని అధికారంలోకి తీసుకురావాలని కోరా రు. కార్యక్రమంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, బాయినేని నవీన్, ఆది, బసవరాజు, హనుమంతరెడ్డి, షేక్‌ముజ్జు, బీటీ రమేష్, కురుబ నాగరాజు, చంద్రశేఖర్‌గుప్తా, వన్నూరెడ్డి, కోళేకుర్తి సుదర్శన్, చాంద్‌బాషా, మాబుసాబ్, జలంధర్‌రెడ్డి, జయశీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కణేకల్లు మండలం గోపులాపురంలో బాధిత కుటుంబీకులకు నారా భువనేశ్వరి పరామర్శ

వైద్య విలువలను మరువకండి


పతకంతో సెల్ఫీ


బంగారు పతకం అందిస్తున్న వీసీ




సాంస్కృతిక కార్యక్రమాల్లోని దృశ్యాలు


పాపతో ఆనందం..


ఆప్యాయంగా ముద్దు..


మాట్లాడుతున్న వీసీ

రోగులపట్ల చిన్న చూపొద్దు
మెడికోలకు వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వీసీ బాబ్జీ సూచన
అట్టహాసంగా మెడికల్ కళాశాల 19వ స్నాతకోత్సవం

అనంతపురం టౌన్, మార్చి 6: 'వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనది. తల్లి జన్మనిస్తే డాక్టర్ పునర్జన్మనిస్తారు. అలాంటి వృత్తిని చేయడం అదృష్టం. ఈవృత్తిలో పనిచేసేవారు విలువలు మరువకూడదు' అని వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ కొంకరబాబ్జీ మెడికోలకు సూచించారు. బుధవారం రాత్రి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అనంత వైద్యకళాశాల 19వ స్నాతకోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈవేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కొంకర బాబ్జీ మాట్లాడుతూ ఎంబీబీఎస్ పూర్తి కాగానే అంతా అయిపోయినట్లు కాదని, మీరు ఇంకా సాధించాల్సింది ఎంతో ఉంద న్నారు. వైద్యవృత్తిలో సాంకేతికతకు ప్రాధాన్యం పెరిగిందని, అందుకే పరిశోధనల వైపు మెడికోలు దృష్టి సారించాలని కోరారు. ఉన్నతమైన కోర్సులు చదివి వైద్య రంగంలో రాణించాలన్నారు. రోగుల పట్ల మానవత్వంతో మెలగాలని, ప్రభుత్వ ఆస్పత్రులకు పేదరోగులే ఎక్కువగా వస్తుంటారని, వారితో గౌరవంగా మాట్లాడి వైద్యం అందిస్తే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యా లరావు మాట్లాడుతూ మీ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించి ఉంటా రు, వారిని మరవ వద్దన్నారు. మరో అతిథి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలను మరచిపోకూడదన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు నవీన్‌కుమార్, సుబ్రహ్మణ్యం, షారోన్‌సోనియా, గైనకాలజీ హెచ్ఓడీ డాక్టర్ షంషాద్‌బేగంతోపాటు పలువురు వైద్యులు, మెడికోలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వంద మందికి డాక్టర్ పట్టాలు

ఎంబీబీఎస్ నాలుగేళ్ల పూర్తిచేసుకున్న వందమంది ఎంబీబీఎస్ మెడికోలకు డాక్టర్ పట్టాలు అందజేశారు. 2018-19 విద్యాసంవత్సరంలో చేరి కోర్సు పూర్తి చేసుకున్న మెడికోలకు హెల్త్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ బాబ్జీ పట్టాలు అందజేశారు. స్నాతకోత్సవం సందర్భంగా సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణను రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఆ విద్యుత్ దీపాల వెలుగుల్లో తమ పిల్లలు డాక్టర్ పట్టా అందుకోవడం చూసిన తల్లిదండ్రులు, బంధువులు ఆనందంతో ఉప్పొంగిపోయారు.

ప్రకృతి వ్యవసాయం.. ఎడారి ప్రాంతాలకు వరం

ఈజిప్టు, యూరప్ ప్రతినిధి బృందం ప్రశంస

రొళ్ల, మార్చి 6: మండలంలోని రత్నగిరి గ్రామంలో ఈజిప్టు, యూరప్ ప్రతినిధి బృందాల సభ్యులు బుధవారం పర్యటించారు. కరవు ప్రాంతంగా గుర్తింపు పొందిన జిల్లాలోని ఈ ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్ర మాలను పరిశీలించారు. ఈ నేలల్లో అద్భుతమైన ఫలితాలు వస్తాయని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్న ఎడారి ప్రాంతాలకు ఆంధ్రప్రదేశ్ ప్రకృతివ్యవసాయ టెక్నాలజీ ఎంతగానో దోహద పడుతుం దని అన్నారు. ఈ రెండు దేశాల ప్రతినిధులు వల్టర్‌లింక్ లూసీవాలెస్, మొల్లిసా, అమర్ సాహెబ్, జస్టిస్‌హనీ తదితరులు పర్యటించారు. ఈసందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్ ప్రకృతి వ్యవసాయం విధి విధానాల గురించి విదేశీ బృందానికి వివరించారు.

నెలనెలా జీతాలివ్వండి

మస్టర్ పాయింట్ల మార్పు వద్దు
పారిశుధ్య కార్మికుల డిమాండ్
వైసీపీ ఇన్‌చార్జి కార్యాలయం వద్ద నిరసన

హిందూపురం అర్బన్, మార్చి 6: రెక్కాడితే కాని డొక్కాడని అభాగ్య జీవులు పారిశుధ్య కార్మి కులని, అలాంటి కార్మికులకు జీతాలు నెలా నెలా చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఇందిరా పార్కు వద్ద నుంచి ర్యాలీగా వెళ్లి వైసీపీ ఇన్‌చార్జ్ దీపిక కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మునిసి పల్ పారిశుధ్య కార్మిక సంఘం కార్యదర్శి జగదీష్, సీఐటీయూ నాయకుడు సాంబశివ మాట్లాడుతూ... రోజంతా కష్టపడి పని చేస్తే ఇచ్చే చాలీ చాలని జీతాలతో కార్మికులు కుటుంబాలను నెట్టు కొస్తున్నారన్నారు. అలాంటి ఆప్కాస్ కార్మికులకు ఈ మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి రెండు నెలలుగా జీతాలు అందించలేదన్నారు. అలాగే కరోనా సమయంలో తీసుకున్న రోజువారీ కూలీ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదన్నారు. కార్మికులను వేధిస్తున్నారని ఆగ్రహించా రు. రాష్ట్రంలో అన్ని మునిసిపాలిటీలలో సక్రమంగా జీతాలు అందించారని, అవార్డులు పొందిన ఏ - గ్రేడ్ హిందూపురం మునిసిపాలిటీలో మాత్రం పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఈ ప్రభుత్వంలో నెలకొందని ఆగ్రహించారు. ప్రజల వద్ద నుంచి ముక్కు పిండి పన్నులు వసూలు చేస్తున్నారు కానీ, పట్టణంలోని అపరిశుభ్రతను తొలగిస్తున్న కార్మికులకు ఎందుకు సక్రమంగా జీతా లు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. దీంతో వారి జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. అదే విధంగా హిందూపురంలో కార్మికులకు నాలు మస్టర్ పాయింట్‌లు ఉండేవని, ఇప్పుడు వాటిన 12 పాయింట్లు గా విభజించి వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయాలను వివరిస్తూ వైసీపీ ఇన్‌చార్జ్ దీపిక కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. మీరు తెచ్చుకున్న కమిషనరే కదా మీరే సమస్య పరిష్కరించాలని బైటాయించారు. అయితే కమిషనర్ ఢిల్లీలో ఉన్నారని ఆయన రాగానే సమస్య పరిష్కరిస్తామని వైసీపీ నాయకులు హామీ ఇవ్వడంతో నాలుగు రోజుల పాటు నిరసనను వాయిదా వేస్తున్నట్లు కార్మిక నాయకులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

చిలమత్తూరు, మార్చి 6: మండలంలోని కందూరుపర్తి గ్రామానికి చెందిన మధువర్ధన్‌రెడ్డి (23) బుధవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమ యంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కందూరుపర్తికి చెందిన నరసింహా రెడ్డి, వేదావతికు రెండో సంతానం మధువర్ధన్‌రెడ్డి. అతడు పదేళ్లుగా కర్ణాటక లోని కృష్ణాపురంలో తన తాత దగ్గరే ఉంటున్నాడు. కందూరుపర్తికి బుధవారం వచ్చి తన సొంతింట్లోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో ఉరికి వేలాడుతున్న అతడిని తల్లి గుర్తించింది. గ్రామస్థులు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టామని ఎస్ఐ తెలిపారు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలే దని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.




కైలాస వాహనంపై ఊరేగుతున్న స్వామివారు, చిన్నారుల నృత్య ప్రదర్శన

ఊరేగిన విశ్వేశ్వరస్వామి

అనంతపురం కల్చరల్, మార్చి 6: స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన బుధవారం కైలాస వాహనంపై కాశీవిశాలాక్షి సమేత విశ్వేశ్వ రుడు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలో దీక్షాహోమం నిర్వహించారు. సాయంత్రం కైలాస వాహనంపై స్వామీ అమ్మవారు ఊరేగారు. ఊరేగింపులో భక్తులు స్వామివారి భక్తిగీతాలు ఆలపిస్తూ, భజనలు చేశారు. అనంతరం శ్రీసాయి నృత్యకళానిలయం ఆధ్వర్యంలో చిన్నారుల సంప్రదాయ నృత్యాలు అలరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యులు కల్పన, రాజేశ్వరి, వెంకటస్వామి, సురేష్‌బాబు, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, డి.సుబ్రహ్మణ్యం, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.






భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న పరిటాల సునీత, బండారు శ్రావణీశ్రీ, వైకుంఠం ప్రభాకర్‌చౌదరి, టీడీపీ అనంతపురం రూరల్ నాయకులు, మాజీ కార్పొరేటర్ రాజారావు

నారా భువనేశ్వరికి ఘన స్వాగతం

అనంతపురం అర్బన్, మార్చి 6: మరూరు టోల్ ప్లాజా వద్ద నారా భువనేశ్వరికి బుధవారం పలువురు ఘన స్వాగతం పలికారు. అందులో వైకుంఠం విజయలక్ష్మి, తెలుగు మహిళలు స్వప్న, బల్లా పల్లవి, విజయశ్రీరెడ్డి, సంగా తేజశ్విని, సరళ, కృష్ణవేణి, దళవాయి రమాదేవి, రాధాదేవి, హసీనా, జానకి, గౌసియా, వసుంధర, కంఠాదేవి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, నాయకులు తలారి ఆదినారాయణ, దేవళ్ల మురళి, సరిపూటి రమణ, రాజారావు, మారుతీకుమార్ గౌడ్, గోపాల్ గౌడ్, సుధాకర్ యాదవ్, కుంచెపు వెంకటేష్, మనోహర్, కూచి హరి, ముక్తియార్ ఉన్నారు.

నారా భువనేశ్వరిని కలిసిన నాయకులు

అనంతపురంరూరల్: నారాభువనేశ్వరిని టీడీపీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం కళ్యాణదుర్గం వెళ్తూ మండలంలోని చిన్నంపల్లి సమీపంలో ఆమె బస చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పరిటాల సునీత అధ్వర్యంలో మండల మాజీ కన్వీనర్ చల్లా జయకృష్ణ, చిన్నంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు మాలపాటి రామాంజినేయులు, నాయకులు వెంకటచౌదరి, రామాంజినేయులు, రాప్తాడు నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షుడు నారాయణస్వామి ఆమెను కలిశారు.

టీడీపీని గెలిపించుకుంటాం

శింగనమల, మార్చి 6: శింగనమల టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీని అధిక మోజార్టీతో గెలిపిచుకుంటామని శింగనమల టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక శింగనమల రామస్వామి దేవాలయంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండి వెంకటనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు కార్యకర్తలు మాట్లాడుతూ.. బండారు శ్రావణిశ్రీని గెలిపించుకొని.. చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి కృషి చేస్తామన్నారు.



సమావేశమైన టీడీపీ నాయకులు

ఘనంగా ఆశ్రమ ముఖద్వారం ప్రారంభం

అనంతపురం కల్చరల్, మార్చి 6: శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమానికి సంబంధించి నూతనంగా నిర్మించిన ముఖద్వారాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. అనంతరం నగరానికి చెందిన ఓలేటి పురుషోత్తం, ప్రసన్నలక్ష్మి దంపతులు విరాళంగా అందజేసిన వెండి కవచాలను మహాగణపతికి అలంకరించి పూజలు నిర్వహించారు. ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు రత్నగిరి దేవరాజు మాట్లాడుతూ... మహా శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం భక్తులతో సామూహికంగా 121 శతపార్థవ లింగపూజ నిర్వహించి, అనంతరం లింగాలను నదీ జలాల్లో నిమజ్జనం నిర్వహిస్తామ న్నారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి శనివారం ఉదయం ఆరు గంటల వరకు యామపూజలు నిర్వహించడంతో పాటు మంచులింగాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ కార్యదర్శి కలవల మల్లికార్జున, కోశాధికారి ప్రసాద్, సహాయ కార్యదర్శులు లక్ష్మీనారాయణ, విశ్వనాథశెట్టి, ప్రధానార్చకుడు కరణం సుబ్బారావు, మేనేజర్ ముడియం చిన్నారెడ్డి పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రకాశ్‌రెడ్డీ.. ఇక నీ ఆటలు సాగవ్

- దౌర్జన్యాలు, దందాలు చేసిందెవరో ప్రజలందరికీ తెలుసు
- ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధం
- మాజీ మంత్రి పరిటాల సునీత



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, మార్చి 6: తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, ఆయన సోదరులు ఇప్పటి వరకు చేసిన దౌర్జన్యాలు, దందాలు ఇక నుంచి సాగవని, ఎన్నికలు ఎంతో దూరం లేవని, ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పడానికి రాప్తాడు ప్రజలు సి ద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి పరిటాల సునీత ఎమ్మె ల్యేపై మండిపడ్డారు. సీకేపల్లిలోని టీడీపీ కార్యాల యంలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. ఆ సోదరుల దౌర్జన్యాల వల్లే ఇక్కడ ఏర్పాటు చేయాల్సిన జాకీ పరిశ్రమ తెలం గాణకు తరలిపోయిన విషయం కూడా ప్రజలకు తెలుస న్నారు. గత ఎన్నికలకు ముందు మీరు ఇచ్చిన హామీలో ఎన్ని నెరవేర్చారో సమాధానం చెప్పగలరా అని ప్రశ్నించారు. టీడీపీ ఐదేళ్ల పాలన, ప్రస్తుత వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో ఎవరి వల్ల అభివృద్ధి జరిగిందో ప్రజలే చెబుతారన్నారు. రాప్తాడులో జరిగిన సిద్ధం సభ గురించి ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకుంటున్నారని, నాలుగు జిల్లాల నుంచి నాలుగు వేలకు పైగా బస్సుల్లో బయపెట్టి జనాన్ని బలవంతంగా తరలించిన విషయం రాష్ట్రం మొత్తానికే తెలుసన్నారు. వాపును చూసి బలుపు అనుకుంటే అది వారికే నష్టమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎల్ నారాయణచౌదరి, కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, ఎజ్జేశంకర్, ముత్యాలప్ప, వరలక్ష్మీ, రామకృష్ణారెడ్డి, గేటుకిష్టప్ప, మాదెం సూర్యనారాయణరెడ్డి, రామాంజి, శివ, హరినాథరెడ్డి, కోళ్లసూరి, చెన్నకేశవుల గౌడ్, ఐటీడీపీ పవన్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక : కనుముక్కల గ్రామానికి చెందిన 10 వైసీపీ కుటుంబాలు బుధవారం టీడీపీలో చేరాయి. స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి పరిటాల సునీత, టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి సమక్షంలో పార్టీలో చేరారు. వైసీపీకి చెందిన బెస్త వెంకటేశ్, దాసరి ఆదెప్ప, తలారి నేలకోటప్ప, తలారి లక్ష్మీనారాయణ, దాసరి అశోక్, మంచి నరసింహులు, శ్రీనివాసులు, గిరిజమ్మ, కిష్టప్పను పరిటాల సునీత పార్టీలోకి ఆహ్వానించారు.

దాడులు చేసిన వారిని అరెస్ట్ చేయాలి

నార్పల,మార్చి 6: దళితులపై దౌర్జన్యాలు, దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. బుధవారం నార్పల పరిధిలోని ముచ్చుకుంటపల్లిలో దళిత నారాయణస్వామిపై జరిగిన దాడిని ఖండిస్తూ పోలీస్ స్టేషన్‌లో బాధితులతో కలసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ.. వైకాపా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళిత గిరిజనులపై దాడులు, దౌర్జన్యాలు అధికమ య్యాయన్నారు. నార్పలలో దళిత నారాయణ స్వామిపై శివశంకర్‌రెడ్డి విచక్షణ రహితంగా దాడి చేయడమే కాక కేసు పెడతే ఎలా తిరుగుతావో చూస్తామని పోలీస్ స్టేషన్ ఆవరణంలోనే బాధితున్ని బెదిరించడం వైసీపీ నాయకుల దౌర్జన్యాలకు పరాకాష్ట అన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి కేసు నమోదు చేయకపోవడం సమంజసం కాదన్నారు. శివశంకర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజాస్వామ్యబద్ధంగా అన్ని వర్గాల ప్రజాసంఘాల నాయకులను కలుపుకొని ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కుల్లాయప్ప, సూర్యనారాయణ,ఉపేంద్ర, నారాయణ, సందీప్, ముకుంద, రామకృష్ణ, ఓబులేసు, బాధితులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాకే హరి

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాలి



జూమ్ మీట్‌లో పాల్గొన్న డీపీఓ, సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, మార్చి 6: జిల్లాలోని పంచాయతీల్లో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఏర్పాటు, వాటి వినియోగంపై సర్వే చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు తెలిపారు. స్వచ్ఛ భారత్ ఎండీ గంధం చంద్రుడు జూమ్ మీట్ ద్వారా బుధవారం ఈ సర్వే గురించి దిశ నిర్దేశం చేశారు. అనంతరం డీపీఓ మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీలో ఇంటింటికి మరుగుదొడ్డి ఉందా.. లేదా.. వాటి నిర్వహణ తదితర వాటిని సర్వే చేయాలని, ఆ సమాచారాన్ని ప్రత్యేక యాప్ అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎల్‌పీఓలు సుమన జయంతి, వెంకటనాయుడు, ఈఓఆర్డీలు నరసింహారెడ్డి, వెంకటేష్, డీపీఆర్‌సీ సౌజన్య, సెక్రటరీలు అశోక్‌కుమార్, ప్రసాద్, చంద్రశేఖర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

దళితులను అణగదొక్కుతున్న సీఎం జగన్



గుడిసెలను పరిశీలిస్తున్న దస్తగిరి, నాయకులు

రాప్తాడు, మార్చి 6: రాష్ట్రంలో దళితులను సీఎం జగన్ అణగదొక్కుతున్నారని వైఎస్ వివేకా హత్య కేసు అప్రూవర్, జై భీమ్ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ దస్తగిరి మండిపడ్డారు. రాప్తాడు మండలంలోని ప్రసన్నాయపల్లి సమీపంలో జై భీమ్ పార్టీ సభ్యులు ప్రభుత్వ స్థలంలో వేసిన గుడిసెలను పరిశీలించారు. గుడిసెలు వేసిన పేదలతో మాట్లాడి రాజకీయ పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ సీఎం జగన్ పోలీసుల అడ్డుపెట్టుకుని దళితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. పేదల ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేస్తే దౌర్జన్యంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కూడా దళితులను భయపెడుతున్నారన్నారు. దీనిపై జై భీమ్ పార్టీ ఆధ్వర్యంలో పేదల కోసం పోరాడుతామన్నారు. వచ్చే ఎన్నికల్లో జై భీమ్ పార్టీ అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందన్నారు. రాప్తాడు నియోజకవర్గానికి జై భీమ్ పార్టీ అధ్యక్షుడు నరేష్ బరిలో ఉంటారని తెలిపారు.

మ్యూజియం ప్రారంభోత్సవం వాయిదా

అనంతపురం కల్చరల్, మార్చి 6: స్థానిక ఆదిమూర్తినగర్‌లో నూతనంగా నిర్మించిన మ్యూజియం ప్రారంభోత్సవాన్ని వాయిదా వేసినట్లు జిల్లా పురావస్తుశాఖ ఏడి రజిత బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 8న నిర్వహించాల్సిన ప్రారంభోత్సవాన్ని అనివార్య కారణాల వల్ల 11వ తేదీకి మార్చినట్లు తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.18 వేలు

అనంతపురంరూరల్ : అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18 వేలు, కనిష్ఠంగా రూ.9 వేలు, సరాసరి రూ.14 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 214 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

అన్న సంతర్పణకు విరాళం

శింగనమల : శింగనమల భవాని శంకర ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా చేపట్టే అన్న సంతర్పణకు రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు బుధవారం రూ. 20 వేలును ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో దాసరి గంగాధర్, కుళ్ళాయప్ప ఆదినారాయణ, కాయల సురేష్ రాజబాబు, శంకర్ నారాయణ, బండి పరుసురాం, జాడేజా, నల్లప్పగౌస్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సీజ్

అనంతపురం న్యూటౌన్ : ఉమ్మడి జిల్లా రామగిరి మండలం ఎగువపల్లి గ్రామ శివారు ప్రాంతంలో ఆటోలో తరలిస్తున్న 12.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారు లు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఆ బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో సీఐ వెంకటరమణ, సీఎస్‌డీటీ కవిత ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘన సన్మానం

అనంతపురం అర్బన్ : ఉద్యోగోన్నతిపై ఏపీఎంఐపీ పీడీగా నియమితులైన రఘునాథ్‌రెడ్డికి ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. బుధవారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో రఘునాథ్‌రెడ్డికి వీడ్కోలు సభ నిర్వహించారు. ఉద్యాన ఏడీ నరసింహారావు, హెచ్‌ఓ పల్లవి, ఏపీఎంఐపీ సూపరింటెండెంట్ ప్రసాద్ ఆయన్ను సన్మానించారు.

రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు

అనంతపురం సెంట్రల్: యాలేరులో ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించామని ఎస్వీ డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పురుషోత్తం, ఆనంద్‌బాబు తెలిపారు. బుధవారం ఎన్ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరం ద్వారా దాదా 200 మంది ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌తో విద్యార్థుల ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

నియామకం

అనంతపురం టౌన్ : వైద్య విధాన పరిషత్ శాఖలో కాంట్రాక్ట్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. 26 పోస్టులకు గాను 19 మంది ఎంపికకాగా.. వారికి కోరుకున్న ప్లేస్‌కు పోస్టింగ్ ఉత్తర్వులు అందజేశారు.

ఇద్దరికి గాయాలు

కూడేరు: మండల పరిధిలోని ముద్దలాపురం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఆత్మకూరు మండలం తలుపూరు గ్రామానికి చెందిన రాము, మహేష్ బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంలో జల్లిపల్లి నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. అనంతపురం వైపు నుంచి జల్లిపల్లి వైపు వెళ్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రాము, మహేష్ తీవ్రంగా గాయపడటంతో వారిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సమావేశానికి పలువురి హాజరు

అనంతపురం అర్బన్ : విజయవాడలోని గవర్నర్‌పేటలో బుధవారం భారత సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన ఆ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పీఎం లక్ష్మీప్రసాద్, జిల్లా అధ్యక్షుడు వెంకటమారుతీ ప్రసాద్ హాజరయ్యారు.

892 మంది గైర్హాజరు

అనంతపురం విద్య: ఇంటర్మీడియట్ పరీక్షలకు బుధవారం 892 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ, జిల్లా పరీక్షల కన్వీనర్ వెంకటరమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనరల్ విద్యార్థులు 24,478 మందికిగాను 23,690 మంది విద్యార్థులు హాజరు కాగా....787 మంది గైర్హాజరయ్యారని, ఒకేషనల్ విద్యార్థులు 2,176 మందికిగాను 2,071 మంది హాజరు కాగా 105 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

మెరుగైన సేవలు అందించాలి

అనంతపురం అర్బన్ : రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. బుధవారం స్థానిక ఆత్మా కార్యాలయంలో దేశాయ్ (డిప్లమో ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెంక్షన్ సర్వీసెస్) కోర్సు శిక్షణ పొందిన డీలర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అనంతపురం ఏడీఏ రవి, ఆత్మా పీడీ మద్దిలేటి, శిక్షణ నిర్వాహకులు లక్ష్మీరెడ్డి, ఏఓ ప్రతాప్ పాల్గొన్నారు.

క్యాంపుల పరిశీలన

అనంతపురంరూరల్: మండలంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాలను ఎంపీడీఓ పుల్లయ్య పరిశీలించారు. బుధవారం కక్కలపల్లి కాలనీ 1,2 సచివాలయాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు మనోజ్, నంద కిశోర్, గణేష్, సాయికుమార్, మహేష్‌బాబు, ఏఎన్ఎంలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ దీక్ష విరమణ

నార్పల: అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నార్పలలో ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్లప్ప ఆధ్వర్యంలో చేపట్టిన ఆమరణ దీక్షను బుధవారం విరమించుకున్నారు. దీక్షలో పుల్లప్పకు బీపీ తగ్గడంతో దీక్ష విరమించి.. అతడిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మీనుగా రామాంజినేయులు, రమణ, గడ్డం నాగేపల్లిజయరాం పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం

అనంతపురం సెంట్రల్: ఎస్కేయూలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) పీడీ శ్రీదేవి, వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తి బుధవారం ప్రారంభించారు. శ్రీదేవి మాట్లాడుతూ.. మహిళలు సమస్యలపై 1098కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

రామగిరి : స్థానిక ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమావేశమై అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురించి మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగాభవాని, ఎంపీపీ నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

చెన్నేకొత్తపల్లి : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని టింబక్టు కలెక్టివ్, చిగురు ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. చెన్నేకొత్తపల్లిలోని చిల్డ్రన్ సెంటర్ ఆవరణంలో బుధవారం మండలంలోని వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు 62 సైన్స్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో మేనేజర్లు శ్రీకాంత్, కార్తీక్, జయశ్రీ, చిగురు కో-ఆర్డినేటర్, రామన్న, సైన్స్ అండ్ ఆర్ట్ డిజైనింగ్ కో-ఆర్డీనేటర్ అడవిరాముడు, చిల్డ్రన్ సెంటర్ ఇన్‌చార్జ్ అలివేళమ్మ, చిగురు కార్యకర్తలు పోతలయ్య, కల్పన, రాధ, ఆనంద్, వలంటీర్లు ఉష, కోకిల, సురేంద్ర, ప్రకృతి బడి ఉపాధ్యాయురాలు గంగమ్మ పాల్గొన్నారు.

'అనంతలక్ష్మి'లో సాంకేతిక సదస్సు



మాట్లాడుతున్న అనంతరాముడు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 6: అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సాంకేతిక జాతీయ సదస్సును నిర్వహించారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సుకు జేఎన్‌టీయూ ఈఈఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసులు, కళాశాల ఛైర్మన్ అనంతరాముడు, వైస్ ఛైర్మెన్ రమేష్‌నాయుడు ప్రారంభించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు నైపుణ్యాలే ప్రామాణికాలని అనంతరాముడు విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామమూర్తి, ఈఈఈ విభాగాధిపతి స్మిత, డీఓఏ కృష్ణప్రియ, కో-ఆర్డినేటర్ పురుషోత్తం, నైపుణ్యాభివృద్ధి సంచాలకుడు సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి సవాలుగా కాలుష్యం



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 6: పర్యావరణ కాలుష్య నియంత్రించడం, సాంకేతిక అభివృద్ధిని సాధించడం తదితర అంశాలు దేశానికి సవాలుగా మారాయని జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లాస్థాయి నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత క్రమశిక్షణతో పాటు లక్ష్యసాధన దిశగా పయనించినప్పుడే దేశం సంపూర్ణాభివృద్ధిని సాధిస్తుందన్నారు. వృత్తిపరమైన విద్యనే కాకుండా యువతీ, యువకులు రాజకీయాల్లోనూ అడుగు పెట్టాలన్నారు. ఆ దిశగా యువతలో చైతన్యాన్ని కలిగించేందుకు యూత్ పార్లమెంట్ సమావేశాల నిర్వహణ దోహదపడుతాయన్నారు. అనంతరం యూత్ పార్లమెంట్ సమావేశంలో ఉత్తమ ప్రతిభకనబర్చిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ శశిధర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎంబీఏ విగాధిపతి ప్రొఫెసర్ నారాయణరెడ్డి, ఏఎస్పీ మల్లికార్జున వర్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు ప్రసాద్, సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపకురాలు ప్రణతి పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

అనంతపురం క్రైం, మార్చి 6: గార్లదిన్నె మండలం కొట్టాలపల్లికి చెందిన ఓ వ్యక్తి నగరంలోని ఎన్టీఆర్ మార్గ్‌లో ఆంధ్ర మద్యం అక్రమంగా విక్రయిస్తుండగా అరెస్ట్ చేశామని వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప బుధవారం తెలిపారు. అతని నుంచి 34 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

దాడి కేసులో ముగ్గురికి ఏడాది జైలు

అనంతపురం క్రైం: దాడి కేసులో ముగ్గురికి ఏడాది జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ మొబైల్ కోర్టు జడ్జి సుజిన్‌కుమార్ బుధవారం తీర్పు నిచ్చారు. 2019లో గార్లదిన్నె మండలం కమలాపురానికి చెందిన చంద్రనారాయణ, అదే గ్రామానికి చెందిన సమీప బంధువులతో గొడవపడ్డాడు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు గార్లదిన్నె పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. ఒక కేసులో చంద్రనారాయణకు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించారు. మరో కేసులో ప్రత్యర్థివర్గానికి చెందిన సూర్యనారాయణ, బాలనారాయణలకు ఏడాది జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు. ఇదే కేసులో మూడో నిందితురాలు భారతికి రూ.వెయ్యి జరిమానా విధించారు.

రేపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అనంతపురం క్లాక్‌టవర్ : స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో శుక్రవారం రజకనగర్‌లో మహిళా పోరాట కమ్యూనిటీ హాల్‌లో ఉదయం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీలక్ష్మి, మల్లేశ్వరి తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీసీ డిక్లరేషన్‌పై హర్షం

ఆత్మకూరు, మార్చి 6 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు బీసీ డిక్లరేషన్ ప్రకటనపై స్థానిక ఆ పార్టీ కార్యాలయం వద్ద నాయకులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు, మాజీ కన్వీనర్‌లు మనోరంజన్, వెంకటనారాయణ, నాయకులు వెంకటేసులు, రామదాసు ఆనంద్, అక్కులన్న, ఆదెప్ప, పూల ఓబులపతి, తిక్కస్వామి, నారాయణ, చిరంజీవి, నరసింహులు, బాబా, చంద్రారెడ్డి, పోతన్న, మల్లన్న, లక్ష్మీదేవి, చెన్నమ్మ, చిట్టెమ్మ పాల్గొన్నారు.



ఆత్మకూరులో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శ్రేణులు

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా రామలింగారెడ్డి

బుక్కరాయసముద్రం, మార్చి 6: టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా మాజీ జడ్పీటీసీ రామలింగారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెనాయుడు బుధవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. తమపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెనాయు డులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



రైతు రుణాలను రీషెడ్యూల్ చేయాలి

గార్లదిన్నె, మార్చి 6: రైతు రుణాలు రీషెడ్యూల్ చేయడంలో బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పెనకచెర్ల డ్యాంలోని సిండికేట్ బ్యాంకు ఎదుట రైతులు, రైతు సంఘం, సీపీఎం నాయకులు చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌లో పంటలు నష్టపోయాయని ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిందే తప్ప రైతులకు చేసింది ఏమీ లేదని విమర్శిం చారు. ప్రస్తుతం పంటలు సాగుచేసేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్యాంకులో రుణాలు రీషెడ్యూల్ చేయాలని పలుమార్లు రైతులు బ్యాంకు మేనేజర్‌ను అడుగుతున్నా.. ఆయన పట్టించుకోవడం లేదని వాపోయారు. రుణాలు రీషెడ్యూల్ చేసే వరకు ధర్నా విరమించబోమని తేల్చిచెప్పారు. స్పందించిన బ్యాంకు మేనేజర్ రిషెడ్యూల్ విషయంలో ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులూ రాలేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. ఈ ధర్నాలో సీపీఎం మండలాధ్యక్షుడు చెన్నారెడ్డి, కార్యదర్శిలు రాముడు, నల్లప్ప, ఓబులేసు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతు సంఘం, సీపీఎం నాయకులు

అభివృద్ధే టీడీపీ ధ్యేయం: జేసీపీఆర్


మహిళలను పలకరిస్తున్న జేసీపీఆర్

తాడిపత్రిటౌన్, మార్చి 6: ప్రజల అభివృద్ధే తెలుగుదేశంపార్టీ ధ్యేయమని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తేరన్నపల్లి, తిమ్మాపురం, దిగువపల్లి, ఎగువపల్లి, కొనగుంటపల్లి, కొట్టాలపల్లి, తిప్పారెడ్డిపల్లి, ఆర్డీటీ కాలనీల్లో జేసీపీఆర్ యువచైతన్య బస్సుయాత్రను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయనకు గ్రామస్థులతోపాటు మహిళలు పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఆరాతీశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు విసిగి వేసారిపోయారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్‌కు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, మండల కన్వీనర్ కూరపాటి నరేంద్రనాయుడు, మురళీధర్‌నాయుడు, సర్పంచు రవి, మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ యుగంధర్, సంజీవపురం పవన్‌కుమార్‌రెడ్డి, చింబిలి ప్రసాద్‌నాయుడు, చల్లా సూరి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

'నిజం గెలవాలి'ని విజయవంతం చేయండి

● మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

పామిడి, మార్చి 6: చంద్రబాబునాయుడు అరెస్టుతో ప్రాణాలు వదిలిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించేందుకు నారా భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మాజీ ఎంపీపీ ఆంజనేయులుగౌడ్ స్వగృహంలో బుధవారం ఆయన టీడీపీ నాయకులతో సమీక్షించారు. గుత్తి మండలం ధర్మాపురం, బేతాపల్లి గ్రామాలలో పర్యటించనున్న నారా భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమానికి తెలుగు తమ్ముళ్లు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, చెన్నవరం మహబూబ్‌బాషా, టీటీ రమణరావు, అప్పన్నగారి కుమార్, రామాంజనేయులునాయక్, రమేష్‌నాయక్, వడ్డే ఆనంద్‌బాబు, రామకృష్ణ, వడ్డే శివకుమార్, బొమ్మా మోహన్ కృష్ణ, గాదిలింగ, సుదర్శన్, మహానందు, నల్లబోతుల శ్రీనివాసులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు నారా భువనేశ్వరి రాక

గుత్తిరూరల్, మార్చి 6: మండలంలోని ధర్మాపురం, బేతాపల్లి గ్రామాలకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి గురువారం వస్తునట్లు మండల కన్వీనర్ బర్ది వలి తెలిపారు. నిజం గెలవాలి కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణంచుకోలేక ధర్మాపురం గ్రామానికి చెందిన ఆంజనేయ గుండె పోటుతో చనిపోయాడు. అలాగే బేతాపల్లి గ్రామానికి చెందిన జయమ్మ కుడా చనిపోయారు. ఆ కుటుంబాలను పరామర్శించి ఓదార్చేందుకు ఆమె వస్తునట్లు ఆయన తెలిపారు.

ఆటో బోల్తా... ఒకరి మృతి

ఉరవకొండ, మార్చి 6: పట్టణశివారులోని గుంతకల్లు రహదారి మార్కెట్ యార్డు సమీపంలో బుధవారం ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో వెంకటరమణ(58)అనే వ్యక్తి మృతి చెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు. వజ్రకరూరు మండలం పందికుంటకు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోకి ఆవు అడ్డురావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న సరోజమ్మ, హనుమక్క, శివమ్మ, ఎర్రమ్మ, నారాయణస్వామి, గౌరమ్మ, హెచ్ నారాయణస్వామి గాయపడ్డారు. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వెంకటరమణ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చౌకబియ్యం పట్టివేత

బొమ్మనహాళ్, మార్చి 6: మండలంలోని ఉప్పరహాళ్ క్రాస్ వద్ద చౌక బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఉప్పరహాళ్‌కు చెందిన గంగాధర్ అనే వ్యక్తి ఆటోలో 21 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని సేకరించి కర్ణాటక కు తరలిస్తుండగా స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పట్టుకుని స్వాధీనం చేసుకునటుట్ల తెలిపారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా చేసి బియ్యాన్ని కణేకల్లు స్టాక్‌పాయింట్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైలుకిందపడి మహిళ ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, మార్చి6: పట్టణ సమీపంలోని యల్లనూరు రైల్వేగేట్ వద్ద బుధవారం కాంతమ్మ (58) అనే మహిళ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. పట్టణంలోని కృష్ణాపురం 2వ రోడ్డులో భార్యాభర్తలు కొండారెడ్డి, కాంతమ్మ నివాసం ఉంటున్నారు. కాంతమ్మ కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండేది. పలుచోట్ల వైద్యం చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై బుధవారం తెల్లవారుజామున రైలుకిందపడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి కుమారుడు ఉన్నాడు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూడేరు, మార్చి 6: మండలంలోని ముద్దలాపురం గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఆత్మకూరు మండలం తలుపూరు గ్రామానికి చెందిన రాము, మహేష్‌గా స్థానికులు గుర్తించారు. బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంలో ఇద్దరు వ్యక్తులు జల్లిపల్లి వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, అనంతపురం వైపు నుంచి జల్లిపల్లికి వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాము, మహేష్‌కు గాయాలు కావడంతో వెంటనే హైవే అంబులెన్స్‌లో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కేబుల్ వైర్లు చోరీ

బెళుగుప్ప, మార్చి 6: మండలకేంద్రంలోని గ్రామ శివార్లలో వ్యవసాయ తోటల్లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మోటార్లకు బిగించిన కేబుల్ వైర్లు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరుసగా శివయ్య తిప్పనాయక్, అంజి, అనిల్, తిప్పేస్వామి, రామాంజి తోటల్లో వైర్లు ఎత్తుకెళ్లారన్నారు. పంటలు సాగు చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మాజీ మంత్రి గుమ్మనూరు మాకొద్దు

గుంతకల్లుటౌన్,మార్చి6: మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం మాకు వద్దు అని తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు అన్నారు. మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం టీడీపీలో చేరికపై తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో బీకే మధు, కురుబ సురేష్, నందీశ్వర్, సురేంద్ర, తలారి శివ, వీరాంజనేయులు, ఉదయ్, అంజనేయులు, రాయల్‌వెంకటేష్, అక్రమ్, హుసేన్, శివ, సురుష్, వాసు, మహేష్, సాగర్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యాలకు పాల్పడేవారికి ఓట్లు వెయ్యరు: నియోజకవర్గంలో దౌర్జన్యాలకు పాల్పడే మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకు ప్రజలు ఓటెయ్యరని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆలూరు వైసీపీ మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం టీడీపీలో చేరడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. స్థానికేతరులకు టికెట్ ఇస్తే ప్రజలు స్వాగతిస్తారు తప్పా గెలపించరన్నారు. టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు జింకల జగన్నాథ్, దశరథ్‌రామ్, చికెన్‌జగన్, ఓ చంద్రయ్య, మహాదేవ్, రవి, నగేష్, జీఆర్ చిన్నఎల్లప్ప, ప్రభాకర్, బాలరామ్, వన్నూర్‌స్వామి, మల్లేష్, సురేంద్ర పాల్గొన్నారు.

రీసర్వే డీటీగా ఆంజనేయప్రసాద్

యాడికి, మార్చి 6: మండల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా ఆంజనేయ ప్రసాద్ నియమితులయ్యారు. తాడిపత్రిలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆంజనేయప్రసాద్ యాడికికి డెప్యుటేషన్‌పై వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న రాజ్‌కుమార్ తాడిపత్రికి బదిలీ అయ్యారు.

చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి


సమస్యలపై ఆరాతీస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

యాడికి, మార్చి6: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. బుధవారం యాడికిలోని నారాయణస్వామికాలనీలో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో సమస్యలపై స్థానికులను ఆరాతీశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, బీసీ సెల్ మండల అధ్యక్షుడు తిరంపురం నీలకంఠ, తెలుగు యువత నాయకుడు విక్రమ్, సుభాన్, రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, రూపునేని రాజశేఖర్, మనోహర్‌చౌదరి, కృష్ణమూర్తి, నరసింహచౌదరి, రామచంద్రారెడ్డి, శ్రీనివాసులు, నాగశేఖర్, పవన్‌చౌదరి, మధురాజు, రామాంజనేయులు, రాజారెడ్డి, నాగేశ్వర, తెలుగు మహిళా నాయకురాలు అనిత, అరుణ పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని 1వవార్డు గాంధీనగర్‌లో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి హాజరయ్యారు. ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకొని సమస్యలపై ఆరాతీశారు. టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నాన్నను ఆశీర్వదించండి

ఉరవకొండ: రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ను ఆశీర్వదించాలని ప్రజలను ఆయన తనయుడు విక్రమ్‌సింహ అభ్యర్థించారు. వజ్రకరూరు మండలంలోని రాగులపాడులో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాల వల్ల లబ్ధిని వివరించారు. చంద్రబాబుతోనే రాష్ట్రభివృద్ధి సాధ్యమన్నారు. మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, టీడీపీ నాయకులు నాగేంద్ర, వలి, నాగభూషణం, ధనుంజయ, ప్రశాంత్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, నరేంద్ర, యూనిట్ ఇన్‌చార్జి రమేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

బెళుగుప్ప: బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీతో అన్నివర్గాలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ తనయుడు జయసింహ అన్నారు. మండలంలోని రమణేపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచుతూ సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేశారు.


వజ్రకూరులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న విక్రమ్‌సింహ

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

కూడేరు, మార్చి 6: మండలంలోని ముద్దలాపురం, కడదరకుంట గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నుంచి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సమక్షంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం కడదరకుంట గ్రామానికి చెందిన గుడిపూటి రాఘవేంద్ర, ముద్దలాపురం గ్రామానికి చాకలి ఎర్రిస్వామి, చాకలి మురళి, మహమ్మద్ రఫీ, వడ్డే సిద్దప్ప, పెన్నోబులు, ఈడిగ రాము పార్టీలో చేరడంతో వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఉరవకొండ: వజ్రకరూరు మండలంలోని పందికుంట గ్రామానికి చెందిన వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. కౌకుంట్ల గ్రామంలో వైసీపీ నాయకులు చంద్రమౌళి, ఎర్రిస్వామి, హనుమప్ప, నరసింహులు, మునీంద్ర, లింగన్నలకు పయ్యావుల శ్రీనివాసులు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

బెళుగుప్ప: మండలంలోని రమణేపల్లిలో బుధవారం వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. పయ్యావుల సోదరులతోనే అభివృద్ధి సాధ్యమన్న నమ్మకంతో పార్టీలోకి చేరమన్నారు. 36 మంది వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వారికి సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.



ఉరవకొండ, బెళుగుప్పలో టీడీపీలోకి చేరిన వారితో పయ్యావుల శ్రీనివాసులు

ఆలయ హుండీ లెక్కింపు

కూడేరు, మార్చి 6: ప్రసిద్ధి చెందిన జోడులింగాల సంగమేశ్వర స్వామి ఆలయ హుండీని అధికారుల పర్యవేక్షణలో బుధవారం లెక్కించారు. దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారి రామాంజనేయులు, చైర్మన్ రామదుర్గం కిష్టప్ప, కమిటీ మెంబర్లు, గ్రామపెద్దలు పాల్గొని లెక్కించారు. 11 నెలల పాటు వివిధ రూపాల్లో రూ.5,46,005 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

బెళుగుప్ప: మండలంలోని బూదిగుమ్మలో వెలసిన హనుమంతరాయ స్వామి, వెంకటరమణ స్వామి ఆలయాల్లో హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శోభారాణి తెలిపారు. హనుమంతరాయస్వామి హుండీలో 1,29,919, వెంకటరమణ స్వామి ఆలయ హుండీలో రూ.24,575 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

ఘనంగా చిత్రలింగేశ్వరస్వామి మహోత్సవం

రాయదుర్గంరూరల్, మార్చి 6: మండలంలోని రాయంపల్లి గ్రామంలో యాదవుల కుల దైవమైన చిత్రలింగేశ్వరస్వామి, ఎల్లమ్మ దేవతల మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని గుమ్మఘట్ట మండలం రంగచేడు సమీపంలో ఉన్న వేదవతి హగరిలో గంగపూజను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. గురువారం ఉదయాన్నే నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఎన్నికల నిబంధనలు అమలు చేయాలి

ఉరవకొండ, మార్చి 6: ఎన్నికల నింబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని జేసీ కేతన్‌గార్గ్ సూచించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్లు, సీఐ, ఎస్ఐలు, రాజకీయపార్టీల నాయకులతో వేరు వేరుగా సమావేశాలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 2,22723 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 263 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వాటిని 32 సెక్టార్లుగా విభజించామన్నారు. 85 ఏళ్ల నిండిన వారు ఇంటి వద్దే ఓటు వేసే వెసులుబాటు ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈఆర్వో శిరీష, తహసీల్దార్లు శ్రీనివాసులు, దస్తగిరి, మహమ్మద్ రఫీ, హరినాథ్, రత్నారాధిక, ఈడీటీ మునీంద్ర సీఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా రామానాయుడు

ఉరవకొండ, మార్చి 6: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ రామానాయుడు నియమితులైయ్యారు. ఏపీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి నుంచి నియామక ఉత్తర్వులు అందినట్లు రామానాయుడు తెలిపారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. అధికార ప్రతినిధిగా ఎంపికైన ఆయనను కార్యకర్తలు అభినందించారు.

పోలీసులకు ఫిర్యాదు

గుంతకల్లుటౌన్, మార్చి 6: స్థానిక మిలటరీ కాలనీలో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి చీటీలు ఎత్తినా డబ్బులు ఇవ్వకుండా ఉడాయించాడని బాధితులు బుధవారం రాత్రి కసాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు రైల్వే ఉద్యోగి క్రిష్టఫర్, అతని భార్య సుకన్య ఐదు సంవత్సరాల నుంచి చీటీలు వేస్తున్నారన్నారు. చీటీలు ఎత్తుకున్నావారికి డబ్బులు అడిగితే రూ.5 వడ్డీ ఇచ్చేవాడన్నారు. మంగళవారం రాత్రి ఇంట్లో సామాన్లను తరలిస్తున్నాడన్నారు. గమనించిన స్థానికులు కసాపురం పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే భార్యభర్తలు పరారయ్యారన్నారు. పోలీసులు క్రిష్టఫర్ ఇంటికి తాళం వేశారు. రూ.2.60కోట్లు ఎగరవేసినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

సింహవాహనంపై బుగ్గ రామలింగేశ్వరుడు


సింహవాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

తాడిపత్రిటౌన్, మార్చి 6: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం స్వామివారిని సింహవాహనంపై ఉంచి మంగళవాయిద్యాల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగింపు చేశారు.

యణ్ణెప్పతాత ఆలయ ముఖద్వారం ప్రారంభం


స్వామివారికి పూజలు జరుపుతున్న గ్రామస్థులు

బొమ్మనహాళ్, మార్చి 6: మండలంలోని గోవిందవాడ గ్రామంలో యణ్ణెప్పతాత దేవాలయానికి సంబంధించిన ముఖద్వారాన్ని బుధవారం ప్రారంభించారు. ఉదయం గంగాజలం తెచ్చి స్వామివారని అభిషేకించి విశేష పుష్పలంకరణ చేసి అనంతరం ముఖద్వారాన్ని ఆవిష్కరించారు. గ్రామపెద్దలు పీ వన్నూరుస్వామిగౌడ్, ఎల్ లోకేష్, ఉమారాజ్, దేవేంద్రప్ప, గురురాజ్‌గౌడ్ సుంకన్న, మృత్యుంజయ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

ఉరవకొండ, మార్చి 6: గవిమఠస్థిత చంద్రమౌళీశ్వరస్వామి బ్రహోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో శ్రీనివాసులరెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బ్రహోత్సవాల నిర్వహణపై సమీక్షించారు. ఆర్డీవో మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రథానికి తాత్కలిక మరమ్మతులు కూడా చేపట్టామన్నారు. రథంలాగే ప్రదేశాలలో ఎలాంటి అవాంతరాలు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో అమృత్‌రాజ్, మండల అధికారులు కావ్య, ఫమీద పర్వీన్, డాక్టర్ సాహితి, ఏఈ గురుమూర్తి, పంచాయతీ కార్యదర్శి గౌస్ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

గుంతకల్లుటౌన్, మార్చి 6: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని శ్రీశంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ అన్నారు. స్థానిక కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు చదువుకే పరిమితం కాకుండా వివిధ పోటీల్లో పాల్గొనడం వల్ల నూతన విషయాలు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల మహిళా సాధికార విభాగం కార్యదర్శులు డాక్టర్ శ్రావణి, డాక్టర్ సుభాషిని, సభ్యులు సువర్ణదేవి, వాణి, లాస్య, భారతి, సైరాబాను, వరలక్ష్మి, ప్రజా సంబంధాల అధికారి బసెట్టి క్రిష్ణయ్య, సీనియర్ అధ్యాపకులు సురేష్‌బాబు, గోపి పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్ వినతులకు సత్వర పరిష్కారం: జీఆర్పీ ఎస్పీ

గుంతకల్లు, మార్చి 6: రాష్ట్ర ప్రభుత్వ రైల్వే పోలీసు శాఖ సిబ్బంది తమ సమస్యలను గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేస్తే సత్వరమే పరిష్కరిస్తామని జీఆర్పీ ఎస్పీ చౌడేశ్వరి తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక జీఆర్పీ ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్‌ను నిర్వహించారు. నలుగురు ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు చేసుకున్న చోటకు బదిలీ చేసినట్లు తెలిపారు. సంస్థాగత సమస్యలను ఒక వారంలో పరిష్కరిస్తామని తెలిపారు, ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించి బదిలీ చేయడంపై రైల్వే పోలీసు అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఎస్పీకి ధన్యవాదాలను తెలిపారు.

ఏఎస్ బదిలీ: సానిక జీఆర్పీ ఎస్పీ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసరు శ్రీనివాసరావు బాపట్ల ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పోస్టింగ్‌పై వచ్చిన కే సురేశ్‌బాబు చార్జ్ తీసుకున్నారు. బదిలీపై వెళ్లనున్న ఏఎస్ శ్రీనివాసరావును ఎస్పీ చౌడేశ్వరి, కార్యాలయ సిబ్బంది శాలువ, పూల మాలతో సన్మానించి వీడ్కోలు పలికారు. జీఆర్పీ సీఐ బీ నగేశ్‌బాబు, క్రైం బ్రాంచ్ సీఐ సాయినాథ్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు, ఏఆర్ఎస్ఐలు గోపి, వెంకటరమణ పాల్గొన్నారు.


ఉద్యోగుల వినతులను స్వీకరిస్తున్న ఎస్పీ చౌడేశ్వరి

మీలో ఒకడిగా ఉంటా... టీడీపీని గెలిపిద్దాం

● ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు


మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 6: మీలో ఒకడిగా వుంటానని విజయాన్ని సాధిద్దామంటూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. బుధవారం ప్రజావేదికలో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామగ్రామాన టీడీపీ విజయమే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. మనమంతా సమష్టిగా వుంటూ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి టీడీపీ కంచుకోటలో పార్టీ జెండా ఎగురవేస్తూ చంద్రబాబును సీఎంగా గెలిపించేందుకు శాయశక్తులా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లికార్జున, మున్సిపల్ మాజీ చైర్మన్ వైసీ రమేష్, గోళ్ల వెంకటేశులు, డీకే రామాంజనేయులు, పాపంపల్లి రామాంజనేయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివాలయానికి రూ.లక్ష విరాళం: బ్రహ్మసముద్రం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి రూ.లక్ష నగదు విరాళాన్ని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు అందజేశారు. ఆయన క్యాంపు కార్యాలయంలో నగదును గ్రామస్థులకు అందించారు. ఆయన మాట్లాడుతూ శివాలయం అభివృద్ధికి మరింత పాటుపడతామన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఆలయ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నమ్మిన వారికి అండగా ఉంటాం

● మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న జేసీ దివాకర్‌రెడ్డి

పామిడి, మార్చి 6: తమని నమ్ముకొని ఉన్న వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి స్వగృహంలో బుధవారం టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు. నేను రాలేను.. ఏదైనా అవసరం వస్తే నా దగ్గరకు రండి.. తనవంతు సహాయం చేస్తానంటూ తెలుగు తమ్ముళ్లకు జేసీ భరోసా ఇచ్చారు. జేసీ పవన్‌రెడ్డికి అనంతపురం ఎంపీ టికెట్ ఇవ్వాలని పెనుకొండ సభలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కోరామన్నారు. ఆయన మిశ్రమంగానే స్పందించారన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో వాల్మీకులు దాదాపు 60వేలు ఓట్లు ఉన్నాయి కాబట్టే మాజీ మంత్రి జయరాంకు అధినేత టికెట్టు ఇవ్వనున్నారని తెలిపారు. జిల్లాలో ఒకటి, రెండు చోట్ల విభేదాలు ఉన్నమాట వాస్తవమేనన్నారు. వాటిని సరిచేసుకుంటే ఉమ్మడి జిల్లాలో 12 స్థానాలు కచ్చితంగా టీడీపీకి వస్తాయన్నారు. తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, ముస్లిం మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్‌రఫీ, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వడ్డే శివకుమార్, గంగరాజు పాల్గొన్నారు.

నిర్మాణం పూర్తికాని భవనాన్ని ఎలా ప్రారంభిస్తారు?

● మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్


ఆహ్వానపత్రికను చూపుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి 6: నిర్మాణం పూర్తికాని ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని ఎలా ప్రారంభిస్తారని టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. స్థానిక నివాసంలో బుధవారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవనంలో కనీస మౌలిక వసతులు కూడా లేకుండా ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఎంతో ఆర్భాటంగా భవన ప్రారంభోత్సవానికి సిద్ధం కావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆపరేషన్ థియేటర్, వైద్యపరికరాలు, బాత్రూం, జనరేటర్ సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కూడా సరిగా లేకుండా ఓపెనింగ్ ఏంటన్నారు. ఇది కేవలం ఎన్నికల స్టంట్ అని విమర్శించారు. 75శాతం మంచాలు గతంలో తాము ఏర్పాటుచేసినవే తప్ప ప్రస్తుతం వంద పడకల ఆసుపత్రికి కొత్తగా మంచాలు ఏర్పాటుచేసిన పాపాన పోలేదన్నారు. కేవలం శిలాఫలకాలపై పేరు వేసుకోవడం, బిల్లులు జేబుల్లో నింపుకోవడం తప్ప ప్రజలకు ఉపయోగపడాలనే ఆలోచన ఎమ్మెల్యేకు లేదన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

రాయదుర్గంరూరల్, మార్చి 6: వేసవి సమీపిస్తుండడంతో గ్రామాలలో నీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని ఎంపీడీఓ అల్లాబకాష్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ విద్యావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలకు కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులు తాగునీటి వసతికి మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. ఏఓ మహేంద్ర మాట్లాడుతూ మండలంలో 10,168 మంది రైతులకురూ. 18.15 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేసిందని త్వరలోనే రైతుల ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. సమాశంలో మహిళా సర్పంచుల స్థానంలో భర్తలు సమావేశానికి హాజరవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నాగిరెడ్డిపల్లి సర్పంచ్ గంగమ్మ స్థానంలో భర్త ముక్కన్న హాజరై తాగునీటి సమస్య ఉందని లేచి వాపోయారు. వైస్ ఎంపీపీ శాంతాబాయి సమావేశానికి హాజరు కాకపోవడంతో తనయుడు లోకేష్ హాజరుకావడం విశేషం. కార్యక్రమంలో తహసీల్దార్ చిట్టిబాబు, ఎంఈఓ నాగమణి, అధికారులు పాల్గొన్నారు.

దళితుల భూముల్లో పనుల అడ్డగింపు

కూడేరు, మార్చి 6: మండల కేంద్రంలోని పొలం సర్వే నెం.535లో కొందరు దళితులు సాగు చేసుకుంటున్న భూమిలో ప్లాట్లు వేసేందుకు ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తుండగా సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. బుధవారం ఆ భూమిలో పనులు చేస్తుండగా విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు చితంబరమ్మ, కరీమ్ అడ్డుకొని పనులు చేయవద్దన్నారు. దళితల భూముల్లో ఇళ్ల పట్టాల పేరుతో అమ్ముకోవడానికి కుట్ర చేస్తున్నారని, అధికారులు అడ్డుకోకపోతే ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

ఉర్దూ కళాశాలను ప్రారంభించాలి

గుంతకల్లుటౌన్, మార్చి 6: పట్టణంలో ఉర్దూ జూనియర్ కళాశాల, హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎస్‌జేపీ ఉన్నత పాఠశాల నుంచి ఉర్దూ కళాశాల వరకు వారు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. ఉర్దూ పాఠశాల వెనుక నాలుగు సంవత్సరాల క్రితం ఉర్దూ జూనియర్ కళాశాల, హాస్టల్‌ను నిర్మించారన్నారు. కళాశాలను ప్రారంభించకుండా ముస్లిం విద్యార్థినులను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు వినోద్, నందకిషోర్, శివమణి, రాజ్‌కుమార్, చంద్ర, రోహిత్, మస్తాన్, రాజేష్, రాము, షేక్షావలి, మనోజ్ పాల్గొన్నారు.

కాలువ ఏర్పాటు

తాడిపత్రిటౌన్, మార్చి 6: పట్టణంలోని అరవింద వాటర్‌వర్క్స్ సమీపంలోని పెన్నానదిలో రజకుల సౌకర్యం కోసం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కాలువను సొంత ఖర్చులతో తవ్వించారు. నీరు నిల్వ ఉండకపోవడంతో దుస్తులు ఉతకడానికి రజకులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకున్న జేసీపీఆర్ సొంత ఖర్చులతో కాలువను తవ్వించారు. అవసరమైతే బోరుబావిని కూడా వేయిస్తానని ఆయన హామీ ఇచ్చారని రజకులు తెలిపారు.

నేడు వైద్యశిబిరం

గుత్తి, మార్చి 6: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో ఉన్న బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌బాబు, నాగదాని చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక బార్ రూంలో ఉచిత గుండె పరీక్షలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ అవకాశాన్ని న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రంథాలయం తనిఖీ

గుంతకల్లుటౌన్, మార్చి 6: పట్టణంలోని గుంతకల్లుశాఖ గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తనిఖీ చేశారు. రికార్డులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రంథాలయ అధికారి కమ్మన్న, సహాయ అధికారి హేమలత, రికార్డు అసిస్టెంట్ రాము పాల్గొన్నారు.